క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్సై సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: ఆటోలు జాగ్రత్తగా నడపాలని ఎచ్చెర్ల ఎస్సై వి.సత్యనారాయణ అన్నారు. ఎచ్చెర్ల పోలీస్ స్టేషన్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాల నివారణపై శనివారం అవగాహన కల్పించారు. ముఖ్యంగా స్కూల్ పిల్లలను పాఠశాలలకు తీసుకు వెళ్లే ఆటో డ్రైవర్లు అప్రమత్తంగా ఉండాలన్నారు. సర్వీస్ ఆటోలు నడిపేవారు పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించవద్దన్నారు. డ్రంక్ అండ్ డ్రైవ్, రాంగ్ రూట్ డ్రైవ్, ఆటోలు కండీషన్ లేకపోవటం వల్ల ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయన్నారు. డ్రైవర్లతో ప్రమాణం చేయించారు.

మనోవికాస కేంద్రం చిన్నారులకు భోజనాలు



అన్నదానం చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: చంపామసీదులోగల మదర్స ఇబ్రహీమా ఆధ్వర్యంలో మదర్సి అబ్దుల్ సత్తార్ అధ్యక్షతన బెహరా మనోవికాస కేంద్రంలోని చిన్నారులకు శనివారం భోజనం ఏర్పాట్లు చేశారు. భారతదేశాన్ని ఆకలి నుంచి రక్షించడానికి ఆలిండియా మానవత్వ సందేశ సమితి ప్రేరణతో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. దీనిలో పలువురు ముస్లిం సభ్యులు పాల్గొన్నారు.

రిమ్స్ అన్నపూర్ణకు చిట్టి చేతుల సాయం



సాయాన్ని అందజేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: జిల్లా కేంద్ర ఆస్పత్రి రిమ్స్‌లో రోగుల సహాయకులకు నిర్వహిస్తున్న నిత్యఅన్నదాన పథకానికి చిన్నారులు సేకరించిన సాయం రూ.పది వేలు అందించారు. నగరంలోని ఆక్స్‌ఫర్డ్ స్కూల్ విద్యార్థులు పొదుపు చేసిన సొమ్ము నుంచి ఈ సాయాన్ని ప్రిన్సిపాల్ ద్వారా శనివారం అందజేశారు. సాయం అందించిన విద్యార్థులను రాష్ట్ర అధ్యక్షుడు ఆర్.లక్ష్మణరావు, అన్నపూర్ణ పథకం అధ్యక్షుడు గంగుల రమణబాబు, ఉపాధ్యక్షుడు సూర రామచంద్రరావు, కార్యదర్శి ఫాల్గుణరావు అభినందించారు.

యువనేత చొరవతో సమస్య పరిష్కారం



డ్రైనేజీని పరిశీలిస్తున్న రామ్‌మనోహర్‌నాయుడు, ఓబులేసు

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చాపురం ప్రాంతానికి చెందిన వారు డ్రైనేజీ, రోడ్డు, వాటర్‌పైప్ లైన్ల సమస్యతో ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ యువనేత ధర్మాన రామ్‌మనోహర్‌నాయుడు దృష్టికి స్థానికులు తీసుకెళ్లారు. దీంతో స్పందించిన ఆయన మున్సిపల్ కమిషనర్ ఓబులేసు, డీఈ రమణమూర్తిలతో కలిసివెళ్లి జేసీబీతో శనివారం పనులు చేయించి సమస్య పరిష్కరించారు. దీంతో స్థానికులు సంతోషం వ్యక్తం చేశారు. శానిటరీ ఇన్‌స్పెక్టర్ గణేష్, అల్లు లక్ష్మీనారాయణ తదితరులున్నారు.

విద్యార్థులకు అభినందన



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

జి.సిగడాం: నియోజకవర్గం స్థాయిలో నిర్వహించిన క్రీడా పోటీల్లో సంతవురిటి జెడ్పీ హెచ్ స్కూల్ విద్యార్థులు సత్తాచాటారు. ఖోఖో, లాంగ్‌జంప్ పోటీల్లో ప్రథమ స్థానం కైవాసం చేసుకున్నారు. గెలిపొందిన విద్యార్థులను హెచ్‌ఎం జయలక్ష్మి, పీడీ బలివాడ యుగంధర్, ఉపాధ్యాయులు శనివారం అభినందించారు.

సమస్యలు పరిష్కరించాలి

రణస్థలం: మధ్యాహ్నం భోజనం పథకంలో పనిచేస్తున్న కార్మికుల సమస్యలు పరిష్కరించాని ఏపీ ఎండీఎం కార్మిక యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు అల్లు మహాలక్ష్మి డిమాండ్ చేశారు. మండల కేంద్రంలోని జే.ఆర్.పురం హైస్కూల్లో యూనియన్ మండల కార్యదర్శి వి.లక్ష్మి అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. నవంబర్ 27, 28వ తేదీల్లోలో విజయవాడలో జరిగే కార్మిక, కర్షక ధర్నాను జయప్రదం చేయాలని కోరారు. వంట కార్మికులకు కనీస వేతనాలు, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత, పెన్షన్ వంటివి అమలు చేయాలన్నారు.

లింగవివక్షతను రూపుమాపుదాం



ఎచ్చెర్ల: లావేరులో మానవహారంగా ఏర్పడిన మహిళలు

ఎచ్చెర్ల, లావేరు: కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో జండర్ ఆధారిత హింసకు వ్యతిరేకంగా జాతీయ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ఎచ్చెర్ల, లావేరు మండలాల్లో మహిళా సమాఖ్యల ఆధ్వర్యంలో అవగాహన సదస్సులు, ర్యాలీలు, మానవహారాలు నిర్వహించారు. ఎంపీడీఓలు, సీహెచ్‌సీ వైద్యులు, ఏపీఓలు, ఐసీడీఎస్ అధికారులు, ఏపీఎంలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

రణస్థలంలో..

రణస్థలం: ఈ నెల 25 నుంచి డిసెంబర్ 22 వరకు జెండర్ కాంపెయిన్ నిర్వహించడం జరుగుతుందని ఎంపీడీఓ ఆర్.వి.రమణమూర్తి తెలిపారు. స్త్రీ, పురుషులు సమానమని, లింగ వివక్ష చూపకూడదని మండల కేంద్రంలో ర్యాలీ చేపట్టి, మానవహారంగా ఏర్పడ్డారు. హెల్త్, మహిళా పోలీస్, ఐసీడీఎస్, విద్యాశాఖ సిబ్బంది, ఏపీఎం రత్నం పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

శ్రీకాకుళం రూరల్: బాల్య వివాహాలను అరికట్టాలని, లింగ నిర్ధారణ చట్టరీత్యా నేరని అధికారులు అధికారులు మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జెండర్ కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో కార్యాలయ పరిధిలో ర్యాలీ నిర్వహించారు. ముందుగా మహిళలందరిచే ప్రతిజ్ఞ చేయించారు. మహిళలకు 21 సంవత్సరాల తరువాతే వివాహం చేయాలని, అమ్మాయి, అబ్బాయిలను సమానంగా పెంచాలన్నారు. రక్తహీనత వల్ల వచ్చే వ్యాధులు, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో శ్రీకాకుళం ఎంపీడీవో రామ్మోహన్, ఎంపీఎం సుజాత, సీసీలు, మండల సమైఖ్య సభ్యులు పాల్గొన్నారు.

బాల్య వివాహాలు చట్టరీత్యా నేరం

ఎచ్చెర్ల క్యాంపస్: బాల్య వివాహాలు చట్టరీత్యా నేరమని కుప్పిలి గ్రామ సచివాలయ మహిళా సంరక్షణ కార్యదర్శి వాకాడ చంద్రిక అన్నారు. కుప్పిలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాల్య వివాహాలపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బాలికలు ఉన్నత చదువులు చదవాలన్నారు. నిరక్షరాస్యులైన తల్లిదండ్రులకు బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థం, విద్య వల్ల చేకూరే ప్రయోజనాలను వివరించాలన్నారు. ప్రభుత్వ నిర్దేశించిన వివాహ వయస్సును తల్లిదండ్రులకు తెలియజేయాలన్నారు. ప్రతి ఒక్కరూ దిశా యాప్ డౌన్‌లో చేసుకోవాలన్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల: మండల కేంద్రంలో ప్రతిజ్ఞ చేస్తున్న మహిళలు



రణస్థలం: మండల కేంద్రంలో మానవహారంగా ఏర్పడిన మహిళా సంఘాల సభ్యులు



శ్రీకాకుళం రూరల్: ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

శనీశ్వరునికి పూజలు



ఉమారుద్రునికి అభిషేకాలు



గుడివీధిలో శనికి పూజలు చేస్తున్న భక్తులు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని పలు శివాలయాల్లోని శనిశ్వరునికి కార్తీక మాస శనిత్రయోదశి సందర్భంగా శనివారం పూజలు జరిగాయి. భక్తులు తమ గ్రహ దోషాలను తొలగించుకునేందుకు శనికి తైలాభిషేకాలు, నువ్వులతో పూజలు నిర్వహించారు. కార్తీక మాసంలో అరుదుగా వచ్చే శనిత్రయోదశిగా అర్చకులు చెప్పారు. గుడివీధిలోని ఉమారుద్రకోటేశ్వరస్వామి దేవాలయంలో నవగ్రహ మండపంలో అర్చకులు ఆరవెల్లి శ్రీరామమూర్తి, చంద్రశేఖరశర్మల ఆధ్వర్యంలో పూజలు జరిగాయి. అలాగే కొన్నావీధి భీమేశ్వరాలయం ఆవరణలోని నవగ్రహ మండపంలో శనీశ్వరునికి అర్చకులు గంట చిన్నరామమూర్తి ఆధ్వర్యంలో భక్తులు పూజలు చేశారు.



కొన్నావీధిలో శనీశ్వరునికి పూజలు

దారి ఏర్పాటుకు పరిశీలన

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): సమస్యల పరిష్కారంపై శ్రీకాకుళం నగర కార్పొరేషన్ కమిషనర్ చల్ల ఓబులేసు ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు. సమాచారం వచ్చిన వెంటనే స్పందిస్తూ సమస్య పరిష్కారానికి కృషి చేస్తున్నారు. నగరంలోని సెయింట్ జోసఫ్ స్కూల్ విద్యార్థులు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారు. ఈ విషయాన్ని స్కూల్ యాజమాన్యం కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. దీంతో ఆర్అండ్‌బీ అధికారులతో కలిసి శనివారం కొత్తవంతెన, స్కూల్ పరిసర ప్రాంతాలను పరిశీలించారు. సమస్య పరిష్కారానికి ఉన్న సాధ్యసాధ్యాలను తెలుసుకున్నారు. కొత్తవంతెన కింద నుంచి స్టేడియం మార్గంలో రోడ్డును ఏర్పాటు చేసేందుకు ఉన్న పరిస్థితులపై ఆలోచన చేశారు. ఆర్అండ్‌బీ ఎస్ఈ జాన్ సుధాకర్, డీఈ గణపతి, టీపీవో ఉమామహేశ్వరరావు, మున్సిపల్ డీఈ రమణ ఉన్నారు.



కొత్తవంతెన వద్ద పరిశీలన చేస్తున్న కమిషనర్ ఓబులేసు, ఇంజనీరింగ్ సిబ్బంది

కరాటే పోటీల్లో విద్యార్థుల ప్రతిభ

శ్రీకాకుళం న్యూకాలనీ: అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో జిల్లాకు చెందిన క్రీడాకారులు సత్తాచాటారు. విశాఖపట్నంలోని పోర్ట్ ఇండోర్ స్టేడియం వేదికగా ఈ నెల 24న మొదలైన 19వ అంతర్జాతీయ కరాటే చాంపియన్‌షిప్–2023 పోటీల్లో శనివారం వాడాడలో ఉన్న ఢిల్లీ ఇంటర్నేషనల్ పబ్లిక్ స్కూల్‌కి చెందిన అంధవరపు లలిత్ మిదిన్(7వ తరగతి) రజతం, కాంస్యం, బందరు విగ్నేష్ (5వ తరగతి)బంగారం, రజతం పతకాలు సాధించారు. వీరిని కోచ్ నక్క లక్ష్మణ్‌నాయుడు, స్కూల్ అకడమిక్ డైరెక్టర్ ముద్దాడ సత్య ప్రసాద్, ప్రిన్సిపాల్ తరిని అర్జున్ చక్రవర్తి, శ్రీకాకుళం జిల్లా మార్షల్ ఆర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు రేగిడి దయామయ అభినందించారు.



పతకాలు సాధించిన క్రీడాకారులతో కోచ్ లక్ష్మణ్‌నాయుడు

మహనీయుల ఆశయ సాధనకు కృషిచేయాలి



అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎచ్చెర్ల, లావేరు: దేశం కోసం త్యాగం చేసిన మహనీయుల ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషిచేయాలని లావేరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మీసాల శ్రీనివాసరావు అన్నారు. నవంబర్ 26న భారత రాజ్యాంగ, సాంఘిక శాస్త్ర దినోత్సవాల సందర్భంగా ఉపాధ్యాయులు, విద్యార్థులు శనివారం ప్రతిజ్ఞ చేశారు. అంబేడ్కర్, బాబూ రాజేంద్రప్రసాద్ విగ్రహాలకు నివాళులర్పించారు. రాజ్యాంగ ప్రవేశిక, ఆర్టికల్స్, షెడ్యూల్ భాగాలు, సవరణలు, రచన కమిటీ సభ్యుల ఫొటోలను ప్రదర్శించారు. ఉపాధ్యాయులు ఎ.వరలక్ష్మి, అరుణశ్రీ, నారాయణబాబు, కృష్ణ, రవికుమార్, శ్రీనివాసరావు, సూర్యారావు, నాగరాజు, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

బాధితులకు సత్వర న్యాయం అందాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: క్రిమినల్ కేసుల్లో బాధితులకు సత్వర న్యాయం, సరైన న్యాయం అందడంలో పబ్లిక్ ప్రాసిక్యూటర్ల పాత్ర కీలకమైనదని జిల్లా డిప్యూటీ డైరెక్టర్స్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మెట్ట మల్లేశ్వరరావు అన్నారు. శనివారం జిల్లా కోర్టు వద్ద పబ్లిక్ ప్రాసిక్యూటర్ల నెలవారీ సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో పలువురు ప్రాసిక్యూటర్లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మెట్ట మల్లేశ్వరరావు

చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం

ఎచ్చెర్ల క్యాంపస్: చెడు వ్యసనాలతో జీవితాలు నాశనం అవుతాయని శ్రీకాకుళం రిమ్స్ మానసిక వైద్య నిపుణులు, అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ బి.సాయిరాం అన్నారు. అంబేడ్కర్ యూనివర్సిటీలోని డిపార్ట్‌మెంట్ ఆఫ్ సోషల్ వర్క్ ఆధ్వర్యంలో ఇంజినీరింగ్ విద్యార్థులకు శనివారం మాదక ద్రవ్యాల వినియోగం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. మత్తుకు బానిసగా మారితే విలువైన జీవితం కోల్పోవటం, ప్రాణాంతక వ్యాధులకు గురికావటం జరుగుతుందన్నారు. ఆరోగ్యకరమైన సమాజం కోసం యువత కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో రిమ్స్ మెడికల్ కాలేజ్ డిఅడిక్షన్ కౌన్సిలర్ వాసు దేవరావు, సోషల్ వర్క్ హెడ్ డాక్టర్ ఎం.అనురాధ, ఇంజనీరింగ్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతాడ రాజశేఖర్‌రావు, అసిస్టెంట్ ప్రొఫెసర్లు యు.కావ్యజోత్స్న, వి.వనజ పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తులకు సత్కారం

శ్రీకాకుళం పాతబస్టాండ్: హైకోర్టు న్యాయమూర్తులు జస్టిస్ యు.దుర్గాప్రసాద్‌రావు, జస్టిస్ జి.రామకృష్ణప్రసాద్‌లను జిల్లా బార్ అసోసియేషన్ ప్రతినిధులు నగరంలోని సన్ రైజ్ హోటల్‌లో శనివారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారికి అరసవల్లి సూర్యనారాయణస్వామి చిత్రపటాన్ని అందజేసి.. దుశ్శాలువతో సత్కరించారు. న్యాయమూర్తులను కలిసిన వారిలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎన్ని సూర్యారావు, ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు జి.చంద్రమౌళి, ఎం.భవానీ ప్రసాద్, వి.హరిప్రియ, సీనియర్ న్యాయవాదులు తర్లాడ రాధాకృష్ణ, కూన అన్నంనాయుడు, పీవీ రమణ దయాల్, మామిడి క్రాంతి, గంగుల భాస్కరరావు, సనపల హరి, ఎ.ఎల్.నారాయణ, పొన్నాడ వెంకటరమణారావు, కె.సూర్యం తదితరులున్నారు.



న్యాయమూర్తులను సత్కరిస్తున్న బార్ అసోసియేషన్ ప్రతినిధులు

ఆదర్శనీయం హిందూధర్మం

గార: సనాతనమైన హిందూ ధర్మం ఆదర్శమైనదని శ్రీపూజ్య రవణ చైతన్యానంద చిన్నస్వామి అన్నారు. రామచంద్రాపురం పంచాయతీలో సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో శనివారం హిందూ సమ్మేళనం జరిగిం సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మన ఆచారాలు, గొప్పతనాలను అందరూ తెలుసుకోవాలన్నారు. గుడి కేంద్రంగా ధార్మిక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. దేవాలయాలను కాపాడుకోవాలన్నారు. ఈ సందర్భంగా గ్రామాల్లో శోభాయాత్రను నిర్వహించారు. కార్యక్రమంలో సర్పంచ్ గొలివి వెంకటరమణమూర్తి, సంస్థ సంయోజక్ రుప్ప రమణమూర్తి, సింహాద్రి ఫాల్గుణరావు, మండల సంయోజిక్ ముద్దపు దామోదరరావు, మహిళా సంయోజిక్ కాళ్ల కరువమ్మ, అంబటి చక్రధరరావు, రుప్ప శ్రీనివాసరావు, అంబటి లింగమూర్తి, సాధు మల్లికార్జునరావు పాల్గొన్నారు.



శోభాయాత్రలో భక్తజనం

4న సినీసంగీత విభావరి

శ్రీకాకుళం కల్చరల్: ప్రముఖ సినీ గాయకులు స్వర్గీయ ఘంటసాల వేంకటేశ్వరరావు జయంతి ఉత్సవాల సందర్భంగా డిసెంబర్ నాలుగో తేదీ సాయంత్రం ఐదు గంటల నుంచి ప్రముఖ నేపథ్యగాయకులు బి.ఎ.నారాయణచే సినీ సంగీత విభావరి నిర్వహించనున్నారు. ఈ విషయాన్ని ఆహ్వాన కమిటీ సభ్యులు నిక్కు అప్పన్న శనివారం ఓ ప్రకటలో తెలిపారు. ఈ సందర్భంగా తాను రచించిన 'గేయ సుధా బిందువులు'పుస్తకాన్ని రాష్ట్ర మంత్రి ధర్మాన ప్రసాదరావు ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం కిమ్స్ ఎదురుగా ఉన్న శ్రీలక్ష్మీశ్రీనివాస కల్యాణ మండపంలో ప్రముఖ వైద్యులు గుడెన సోమేశ్వరరావు సౌజన్యంతో నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎక్సైజ్ అధికారుల సస్పెన్షన్‌పై హర్షం

గార: జిల్లా ఎక్సైజ్ శాఖలో ముగ్గురు అధికారులపై వచ్చిన అవినీతి ఆరోపణలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి..వారిని సస్పెన్షన్ చేయడం హర్షణీయమని రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ ముంజేటి కృష్ణమూర్తి అన్నారు. శనివారం విలేకరులతో ఆయన మాట్లాడుతూ.. అవినీతిని రూపుమాలన్న ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం పలు సంస్కరణలు చేపట్టిందన్నారు. మద్యం దుకాణాల కేటాయింపు, ఉద్యోగుల నుంచి లంచాలు అడినట్టు అందిన ఫిర్యాదుల నేపథ్యంలో విచారణ జరిగిందన్నారు. విచారణ చేసి చర్యలు తీసుకోవడం సంతోషదాయకమని అన్నారు. సమావేశంలో సర్పంచ్‌లు అరవల రామారావు, సుంకాన సురేష్, శిమ్మ ధర్మరాజు ఉన్నారు.

రాజ్యాంగంపై అవగాహన కలిగి ఉండాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: భారతరాజ్యాంగంపై విద్యార్థి దశ నుంచే అవగాహన పెంపొందించుకోవాలని సెట్‌శ్రీ మేనేజర్ అప్పలనాయుడు అన్నారు. శ్రీకాకుళం నగరంలోని భాష్యం పాఠశాలలో శనివారం భారత రాజ్యాంగ వ్యవస్థపై విద్యార్థులకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా భారత రాజ్యాంగ విశిష్టతను, ప్రాధాన్యతను విద్యార్థులకు వివరించారు.

వ్యభిచార గృహంపై పోలీసుల దాడులు

శ్రీకాకుళం క్రైమ్: నగరంలోని పీఎన్‌కాలనీ రెండో లైన్‌లో వ్యభిచారం నడుపుతున్న ఓ ఇంటిపై శ్రీకాకుళం రెండో పట్టణ పోలీసులు శనివారం దాడులు జరిపారు. సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ పోలీసులు కలిసి దాడులు చేపట్టారు. ఓ ఇంటిని అద్దెకు తీసుకొని ముగ్గురు నిర్వాహకులు.. ఇద్దరు విటులతో వ్యభిచారం చేయిస్తుండగా రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. ముగ్గురు నిర్వాహకులను అదుపులో తీసుకున్నామని, దీనిపై కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తహసీల్దార్ సత్యనారాయణ

ఎచ్చెర్ల క్యాంపస్: చిలకపాలెంలోని శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం సాయంత్రం ఫ్రెషర్స్ డే వేడుకలు విద్యార్థులు కేరింతల మధ్య నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఎచ్చెర్ల తహసీల్దార్ టి.సత్యనారాయణ హాజరయ్యారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదివి జీవితంతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని పిలుపునిచ్చారు. విద్యార్థులకు నిర్వహించిన ఆటలు, విద్యా సంబంధిత పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు, కళాశాల యాజమాన్య సభ్యుడు దుర్గాప్రసాద్ రాజు పాల్గొన్నారు.

హైకోర్టు జడ్జిలను కలిసిన కలెక్టర్, ఎస్పీ





హైకోర్టు న్యాయమూర్తులకు పుష్పగుచ్ఛాలు అందజేస్తున్న కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ రాధిక

శ్రీకాకుళం పాతబస్టాండ్: రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం పరిపాలనా నాయమూర్తులు జస్టిస్ యు.దుర్గా ప్రసాద్‌రావు, జస్టిస్ జి.రామకృష్ణ ప్రసాద్‌లను కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్, ఎస్పీ జి.ఆర్.రాధిక శనివారం ఓ ప్రైవేటు హోటల్‌లో మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా కోర్టు కాంప్లెక్స్‌లో న్యాయమూర్తులతో జరగనున్న జ్యుడీషియల్ వర్క్‌షాప్, న్యాయ సమీక్ష సమావేశానికి వీరు విచ్చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఉన్నతాధికారులు గౌరవ పూర్వకంగా కలిసి మాట్లాడారు. కార్యక్రమంలో హైకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ జి.యతిరాజులు, జిల్లా ప్రధాన న్యాయుర్తి జునైద్ అహ్మద్ మౌలానా, డీఎల్ఎస్ఏ కార్యదర్శి ఆర్.సన్యాసినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న 'రండి నాపాట వినండి'



కార్మికులకు దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

శ్రీకాకుళం కల్చరల్: సూత్రా ఫౌండేషన్ తొమ్మిదో వార్షికోత్సవం వ్యవస్థాపకులు నిక్కు హరిసత్యనారాయణ ఆధ్వర్యంలో బాపూజీ కళామందిర్‌లో శనివారం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా 20 మంది గాయకులతో గాయత్రీ స్వరాంజలి ఆర్కెస్ట్రా నిర్వాహకులు కె.ఎల్.ఎన్.మూర్తి ఆధ్వర్యంలో జరిగిన ఈ సంగీత విభావరిలో పాత, కొత్తపాటలతో గాయకులు అలరించారు. సమాజ సేవలో భాగంగా తన భార్య నిక్కు రాములమ్మ జ్ఞాపకార్థం విశాఖ ఏ కాలనీకి చెందిన మున్సిపల్ పారిశుద్ధ్య కార్మికులకు నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. కళారంగంలో వివిధ సేవలు అందిస్తున్న గాయకులు కె.ఎల్.ఎస్.మూర్తి, ప్రముఖ నృత్య దర్శకురాలు డాక్టర్ టి.నీరజ సుబ్రహ్మణ్యం, ప్రముఖ ఏ–1గ్రేడ్ తబలా ఆర్టిస్టు బందారు రమణమూర్తిలను సత్కరించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న మాజీ శాసనసభ్యులు గుండ లక్ష్మీదేవి సూత్రాఫౌండేషన్ సేవలను కొనియాడారు. డాక్టర్ కె.సుధీర్, ఇప్పిలి శంకరశర్మ, చిట్టి వేంకటరావు, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు పొన్నాడ రవికుమార్, తెరవే అధ్యక్షులు నాగేశ్వరరావు, జోగినాయుడు పాల్గొన్నారు.

సీఎం జగన్‌తోనే అభివృద్ధి

ఎచ్చెర్ల క్యాంపస్: సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితోనే అభివృద్ధి సాధ్యమని ఎచ్చెర్ల ఎంపీపీ మొదలవలస చిరంజీవి అన్నారు. అజ్జరాం గ్రామంలో శనివారం వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఆవిష్కరించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల డిస్‌ప్లే బోర్డును ఆవిష్కరించారు. గ్రామంలో ఇంటింటికీ వెళ్లి నవరత్న పథకాలను వివరించారు. అనంతరం 24 పేజీల సంక్షేమ పథకాలు బుక్‌లెట్‌ను అందజేశారు. గత ప్రభుత్వం, ప్రస్తుత ప్రభుత్వ పాలన మధ్య వ్యత్యాసాన్ని వివరిచారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు ముద్దాడ శంకర్, జేసీఎస్ కన్వీనర్ మూగి శ్రీరాములు, మండల పరిషత్ విప్ బగ్గు రాజారావు, జిల్లా ఎగ్జిక్యూటీవ్ మెంబర్ అంబటి రాంబాబు, డీసీఎంఎస్ మాజీ ఉపాధ్యక్షుడు బోర సాయిరాంరెడ్డి, సర్పంచ్ సుగ్గు శ్రవంతి, ఎంపీటీసీ సభ్యుడు బోర గోవిందరెడ్డి పాల్గొన్నారు.



సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరిస్తున్న ఎంపీపీ చిరంజీవి

సంక్షిప్తంగా..

కులగణనలో రెల్లి ఉపకులాలను నమోదు చేయాలి

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): ప్రభుత్వం వచ్చే నెల తొమ్మిదో తేదీ నుంచి చేపట్టనున్న కులగణనలో రెల్లి ఉపకులాలు నమోదు చేయాలని ఏపీ రెల్లికుల ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు గండి విజయ్‌కుమార్, జిల్లా అధ్యక్షుడు మోహనరావు కోరారు. ఈ మేరకు కరపత్రాన్ని శనివారం ఓ ప్రైవేటు కార్యాలయం వద్ద విడుదల చేశారు. రెల్లి, పైడి, పాకి, హడ్డి, గాషీ, గొడగల, బావూరి, షబరి, సచ్చడి, దండాసి, తోటి, మోహతర్, పమిడి, మోచిలుగా నమోదు చేయాలని విజ్ఞప్తి చేశారు.

మహిళా సాధికారత అవసరం

శ్రీకాకుళం పాతబస్టాండ్: మహిళా సాధికారతతోనే సమసమాజ స్థాపన జరుగుతుందని జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ పథక సంచాలకుడు విద్యాసాగర్ అన్నారు. లింగ వివక్షకు వ్యతిరేకంగా శనివారం డీఆర్‌డీఏ ఆధ్వర్యంలో జిల్లా మహిళా సమాఖ్య సభ్యులు సంతోషిమాత గుడి వద్ద నుంచి కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. జిల్లా సమాఖ్య అధ్యక్షులు మూల కృష్ణవేణి, సెర్ప్ జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్లు ఎస్.వైకుంఠరావు, బి.నారాయణరావు, శ్రీ.కె. మోహనరావ, జెండర్ ఏపీఎం ఎస్.ధనలక్ష్మి, బ్యాంకు లింకేజీ డీపీఎం ఎస్.నాగలక్ష్మి, సామాజిక భద్రత డీపీఎం గౌరి, వి.సుజాత పాల్గొన్నారు.

కారుణ్య నియామకం చేపట్టాలని వినతి

శ్రీకాకుళం అర్బన్/శ్రీకాకుళం పాతబస్టాండ్: సాంఘిక సంక్షేమ శాఖలో కారుణ్య నియామకానికి త్వరితగతిన చర్యలు తీసుకోవాలని ఏపీ ఎన్‌జీవో సంఘ రాష్ట్ర సహాధ్యక్షుడు చౌదరి పురుషోత్తమనాయుడు కోరారు. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ విశ్వమోహన్‌రెడ్డిని శనివారం శ్రీకాకుళంలోని ఆయన చాంబర్‌లో కలిసి వినతిపత్రం అందజేశారు. సోషల్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్‌లో హెచ్‌డబ్ల్యూఓగా పనిచేసిన సూర కల్యాణి మరణించారని, ఆమె కుమారుడికి కారుణ్య నియామకం చేపట్టాలని విన్నవించారు. ఏపీ ఎన్‌జీవో సంఘ నాయకులు శశిభూషణరావు, బొత్స శ్రీనివాసరావు, బడగల పూర్ణచంద్రరావు, డి.శ్రీరాం, అన్నెపు యతిరాజు, తామరాపల్లి శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నాడు–నేడు పనులు త్వరగా పూర్తిచేయాలి

శ్రీకాకుళం న్యూకాలనీ: పదో తరగతి పరీక్షలు సమీపిస్తున్నందున ఎగ్జామ్ సెంటర్లుగా ఉన్న పాఠశాలల్లో నాడు–నేడు ఫేజ్–2 పనులు త్వరితగతిన పూర్తిచేయాలని ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పడాల తమ్మినాయుడు, ప్రధాన కార్యదర్శి ఎస్.వి.రమణమూర్తి విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు శనివారం సమగ్ర శిక్ష ప్రాజెక్ట్ జిల్లా అదనపు కో–ఆర్డినేటర్ డాక్టర్ రోణంకి జయప్రకాష్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అంతకుముందు సమగ్రశిక్ష ప్రాజెక్ట్ సెక్టోరియల్ అధికారులుగా ఇటీవలి నియామకమైన సీఎంవో పేడాడ ప్రభాకరరావు, ఏఎంవో గుంట లక్ష్మీనారాయణ, ఏఐఈ కోఆర్డినేటర్ వెలమల ఉమ, బైజూస్ జిల్లా నోడల్ ఆఫీసర్‌గా నియామకమైన గురుగుబెల్లి భాస్కరరావును ఎస్టీయూ జిల్లా కమిటీ ప్రతినిధులు అభినందించారు. ఎస్టీయూ ప్రతినిధులు బగాన రమణమూర్తి, బగాన రామారావు, ఎం.సన్యాసిరావు, గురువు శ్రీనివాసరావు, శిమ్మ రామచంద్ర పాల్గొన్నారు.